# వలపు గాలి

"లేవండి, పిల్లల్లారా, లేవండి ఉదయమయ్యింది.

గిన్నెలో జీవనమధువు ఎండిపోక ముందే గిన్నెల్ని నింపుకోండి"

నిద్ర లేవగానే ఉమర్‌ఖయ్యామ్ రుబాయీ గుర్తుకొచ్చింది నాకు. పక్కమీద నుండి లేవకుండానే కొబ్బరి ఆకుల మీదపడి మెరిసిపోతున్న ఉదయం ఎండను, మాటిమాటికి కిటికీ చువ్వలమీదవాలి కువకువలాడుతూ పలుకరించి మళ్ళీ ఎగిరిపోతున్న పిట్టలను చూస్తూ వుండిపోయాను.

కిటికీలో నుంచి చల్లటిగాలి వచ్చి శరీరాన్ని స్పృశిస్తూ వుంటే హాయిగా వుంది. చెదిరిపోయిన చీరను సర్దుకోకుండానే అలాగే పడుకున్నాను.

కిటికీ దగ్గరున్న పూలమొక్కల దగ్గర ఏదో అలికిడి వినిపించింది. వదులుగా వున్న చీరను సర్దుకుని కిటికీ దగ్గరకొచ్చి చూస్తే పూలమొక్కల మధ్య కూర్చున్న వసంత్ కనిపించాడు.

"ఇక్కడ కూర్చున్నావెందుకు?"

నేను అడిగిన ప్రశ్నకు అతను ఎప్పుడూ సూటిగా సమాధానం చెప్పడు.

"రాత్రంతా ఇక్కడే కూర్చున్నాను"

"ఎందుకు?"

"నువ్వెళ్ళిపోతున్నావ్ కదా. నీ అందాలను నా కళ్ళల్లో శాశ్వతంగా నిలుపుకునే ప్రయత్నంలో వున్నాను" అన్నాడు.

అతని పిచ్చిమాటలు, పిచ్చి చేష్టలు నాకు నచ్చవ్, కిటికీ తలుపులు మూసి లోపలికి వచ్చి కూర్చున్నాను. టేబిల్‌మీద కనిపించిన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాగితం చూడగానే మనస్సు స్థిమితపడింది.

ఒక్కరోజు ఓపికపడితే చాలు ఈ పల్లెటూరు నుంచి బైటపడొచ్చు.

మండల ప్రజాపరిషత్ స్కూలు నుంచి మున్సిపల్ స్కూలుకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. పట్టణంలో వున్న అమ్మ, తమ్ముడి దగ్గరకు వెళ్ళిపోతున్నాను.

.... వసంత్ అందగాడే! ప్రేమిస్తున్నానంటూ ఎప్పుడూ వెంటబడుతుంటాడు. ప్రేమపిచ్చి లేకపోతే ఈ భూప్రపంచంలో అతనంత మంచివాడు మరొకడు వుండడు. అతని అందచందాలు, గుణగణాలు నేనెందుకు బేరీజువెయ్యాలి? అతని గొడవ నాకెందుకు?

స్కూల్లో రిలీవింగ్ ఆర్డర్ తీసుకోవాలి. సామాను సర్దుకోవాలి. అన్ని పనులు కొలిక్కివస్తే సాయంత్రమే ఈ పల్లెటూరు నుంచి బయటపడాలి.

నేను ఇక్కడకొచ్చి రెండేళ్ళు అవుతుంది.

అదేం చిత్రమో? పల్లెటూరంటేనే విసుక్కునే దాన్ని ఇప్పుడు మంజీరాలు, మందాకిని, మల్లెలు మీద మమకారం పెరుగుతూ వుంది. మమకార బంధంలో చిక్కుకోకముందే ఈ ఊరి నుంచి బయట పడాలి. 'మ' కారం మీద మమకారం ఏమిటి?

బాత్ ఆయిల్, జెల్స్‌తో స్నానం చేసేదాన్ని ఇప్పుడు సున్నిపిండి ఒంటికి రుద్దుకుంటున్నాను.

ఎప్పుడూ కూల్‌డ్రింక్స్ తాగేదాన్ని ఇప్పుడు మజ్జిగతేట ఇష్టంగా తాగుతున్నాను.

తమ్ముడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. వాడికి అన్నం పండిపెట్టడానికి అమ్మ వాడి దగ్గరే వుంది.

తమ్ముడు చదువు పూర్తయి ఉద్యోగం పచ్చేవరకు నేను ఇబ్బందులుపడాల్సిందే.

అమ్మవాళ్ళకి దగ్గరగా వుండొచ్చని మున్సిపల్ స్కూలుకు ట్రాన్స్‌ఫర్ కోసం నాలుగైదు సార్లు హైద్రాబాద్‌లో వున్న ఓ బంధువు ద్వారా ప్రయత్నం చేసింది.

ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ రావడం మళ్ళీ అది కాన్సిల్ కావడం జరిగింది. ఎవరో బాగా డబ్బు ఖర్చు పెట్టి నా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ కాన్సిల్ చేయించారట.

నా మీద కక్షకట్టి ఎవరు ఆ పనిచేశారో తెలియలేదు.

పట్టుదల వదలని విక్రమార్కుడిలా మా బంధువు మళ్ళీ నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చేటట్లు చేశాడు.

ఈ ఊళ్లో వుండేది ఇంకా ఒక్కరోజే!

వసంత్ గొడవ వదిలిపోతుంది.

నేను కనిపిస్తే చాలు ప్రేమిస్తున్నానంటాడు. 'నువ్వు లేనిదే బ్రతకలేనంటాడు. నన్ను తలుచుకోగానే అతనికి తాపం కలుగుతుందట.

నన్ను చూస్తే పిచ్చెక్కుతుందట... నన్ను తాకితే మోహం కలుగుతుందట... ఇదెక్కడి చోద్యం? మొన్న స్కూలు దగ్గర కనబడి - "నీలిమా నీ మొహంలో చిరునవ్వు, చూపులలో సోయగం, నీ నడకలో తత్తరపాటు చూస్తుంటే నా మతిపోతూ వుంది" అనేశాడు నా అందాలను తాగేస్తున్నట్లు చూస్తూ.

"నలుగురు నడిచే రోడ్డు మీద నిలబడి ఏమిటా ప్రేలాపన?" అన్నాన్నేను.

"ఇంటి దగ్గర మాట్లాడుకుందామా తీరిగ్గా?" అన్నాడతను.

"నీతో మాట్లాడే తీరిక నాకు లేదు. స్కూలు టైం అవుతుంది నువ్వెళ్ళు ఇక్కడ నుంచి" అరిచినంత పనిచేశా. కదలడే ఉత్త మొండిమనిషి.

ఇప్పటికే ఊరంతా గోల, గోలగా వుంది. మా ఇద్దరి గూర్చి ఊళ్ళో అందరూ చెవులు కొరుక్కోనడమే! అతనికేం మగమహారాజు. చివరికి అందరూ తననే తట్టిపోస్తారు. ముల్లు వచ్చి అరిటాకుమీదపడ్డా అరిటాకుదే తప్పంటారు.

వసంత్ చుట్టూ స్కూలు పిల్లలు మూగారు.

అతనంటే పిల్లలకు ప్రాణం. కమ్మగా పాటలు పాడతాడు. జామకాయలు, కందికాయలు, పెసర కాయలు జేబులనిండా తెచ్చి అందరికీ పంచుతాడు.

అతనికి పిల్లలన్నా, పువ్వులన్నా, చెట్లన్నా పంచప్రాణాలు. వాళ్ళింట్లోనే నేను అద్దెంకుండేది.

ఇంటిముందు ఓ పెద్ద మామిడిచెట్టు వుంది. ఉదయం, సాయంత్రం ఆ చెట్టుకింద చేరి ఆ చెట్టుకు ఏవో కబుర్లు చెబుతూ వుంటాడు వసంత్.

"చెట్టుతో మాట్లాడుతున్నావేంటి?" అర్థంకాక అడిగిందోసారి.

"ఆ చెట్టు మా నాన్నగారు నాటింది. ఆ చెట్టును చూస్తుంటే మా నాన్న బ్రతికి వున్నట్లే అనిపిస్తుంది. నేను చెప్పే మాటలు ఆయన వింటున్నట్లు అనిపిస్తుంది. మా నాన్నకు నీ గురించే చెబుతున్నా.

... నీ కళ్ళు తామరపూలలా వుంటాయని, నీ మెడ శంఖంలా వుంటుందని, నీ చేతులు కెంపులు పొదిగినట్లుంటాయని చెప్పా ! నువ్వు పట్టుచీర కట్టుకుని, తలనిండా కనకాంబరాలు పెట్టుకుని, మా అమ్మ నగలు ఒంటినిండా ధరిస్తే దేవకన్యలా వుంటావని కూడా చెప్పేశా" అన్నాడతను.

నాకు కోపం వచ్చి ముక్కుపుటాలెగరేస్తూ "మీ అమ్మ నగలు నేనెందుకు పెట్టుకోవాలి" అన్నాను.

మౌనంగా వుండిపోయాడు.

ఎప్పుడూ అంతే ! ఏం మాట్లాడినా నా అందం గూర్చి ప్రస్తావన తేకుండా వుండడు.

వసంత్ గూర్చి ఆలోచించడం మానేసి ముందు గదిలోకి వచ్చాను. టూత్‌బ్రష్ మీద పేస్టు వేసుకుని అలమరాలోని పుస్తకాల దొంతరకేసి చూశా.

ఆ పుస్తకాలే నా స్నేహితులు. వెన్నెల బాటలో పరుగులు తీసే వెండిరథాలు ఆ పుస్తకాలు. పుస్తకం చదువుతుంటే వెన్నెట్లో వెండి రథం మీద విహరిస్తున్నట్లుంటుంది.

పుస్తకాల్లో నుంచి కృష్ణశాస్త్రి, చలం, బుచ్చిబాబు, ఆల్‌బర్టో మోరావియో, గైడిమొపాసా, సాదత్‌హసన్‌మాంటో తొంగిచూస్తున్నట్లు అనిపించింది. ఆ పుస్తకాల్లోని పాత్రలను ఆరాధిస్తుందిగాని ఆ పాత్రలు సజీవంగా ఎదురు నిలబడితే ధైర్యంగా తలెత్తి చూడలేదు.

స్కూలుకు వెళ్ళి రిలీవింగ్ ఆర్డర్ తీసుకోవాలి – ఆ విషయం గుర్తుకొచ్చింది. మొహం కడుక్కుని వంటపనిలో మునిగిపోయాను.

వసంత్ తల్లి దుర్గమ్మ వచ్చింది వంటగదిలోకి. చిన్న గిన్నెలో తోటకూర పప్పు తెచ్చింది.

"అమ్మాయ్ వెళ్ళిపోతున్నావటగా" అందామె. ఆమె మాటల్లో నేను వెళ్ళిపోతున్నందుకు సంతోషం ధ్వనించింది.

"అవునండి...ట్రాన్స్‌ఫర్ వచ్చింది. ఈ రోజు సాయంత్రంగాని రేపుగాని వెళ్దామనుకుంటున్నాను"

కాఫీ వేడిచేసి గ్లాసులో పోసి ఆమెకిచ్చాను.

"నగలు పోయిన దగ్గర్నుంచి నా మనస్సు ఏం బాగోలేదమ్మాయ్. నీ సంగతే పట్టించుకోలేదు. ఏమనుకోకమ్మాయ్" అందామె కాఫీ చప్పరిస్తూ.

నిజంగానే నగలు పోకముందు ఎంతో ఆప్యాయంగా వుండేది. ఇంట్లో ఏ కూరచేసినా తెచ్చి నాకు ఇచ్చేది.

ఆమెకు వసంత్ ఒక్కడే కొడుకు. ఐదెకరాల మాగాణి వుంది. ఇంటర్ తప్పడంతో చదువుమానేసి వ్యవసాయంలో పడ్డాడు వసంత్.

తనకు వున్న పొలమే కాకుండా మరో నాలుగైదు ఎకరాలు కౌలుకు తీసుకుని మరో ధ్యాసలేకుండా మట్టిలో బంగారం పండించేవాడు.

దుర్గమ్మకి వడ్డాణం, కాసులపేరు, లోలకులు, గాజులు, అరవంకీలు, జడపిన్ను బంగారపువి వుండేవి. చాలాసార్లు అవన్నీ తెచ్చి చూపించింది నాకు.

ఆ నగలన్నీ మాయమయ్యాయి.

పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి కూడా చెప్పొచ్చింది.

నగలు పొయ్యాయన్న బాధకాదుగాని, నా మీద ఆమెకు చిరాకు ఏర్పడడానికి వేరే కారణం వుంది. నేను వచ్చిన దగ్గర్నుండి వసంత్‌కు వ్యవసాయం మీద దృష్టి తగ్గింది. అతను ఎప్పుడూ నా గదిముందే పడిగాపులు గాయడం ఆమెకు నచ్చలేదు. పెళ్ళిచేస్తే దారికి వస్తాడేమోననుకుని నాలుగైదు సంబంధాలు చూసింది. అవన్నీ తిప్పికొట్టాడు వసంత్. చివరకు నన్నే తన కొడుకును చేసుకొమ్మని అడిగింది.

“ఇప్పుడిప్పుడే పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యంలేదండి. అయినా పెళ్లంటూ చేసుకుంటే పట్నం కుర్రాడిని చేసుకుంటా” అని సమాధానమిచ్చాను.

దాంతో ఓ నెలరోజులు నాతో మాట్లాడడం మానేసింది. ఆ తరువాత మాట్లాడడం మొదలుపెట్టినా ముభావంగానే వుంటున్నదామె.

దుర్గమ్మగారు వెళ్ళేక బాత్‌రూమ్‌లో దూరాను. బట్టలు విప్పేసి బిందెలోని చల్లటి నీళ్ళు చెంబుతో ఒంటిమీద ఒంపుకున్నాను. చల్లటినీళ్ళు శరీరానికి తగిలి ప్రాణానికి హాయనిపించింది. నా ఉచ్ఛ్వాస నిశ్వాసాలకి కదిలే అందాలు నాకే ముద్దొచ్చాయి.

ఆ క్షణంలోనే వసంత్ గుర్తుకొచ్చాడు. స్నానం చేసేటప్పుడు తల్లోపూలు తరుముకుంటున్నప్పుడు తను ఇష్టపడే మగాడిని తలుచుకోని పడతి వుండదు కదా ! నా నగ్న సౌందర్యాన్ని వసంత్ చూస్తున్నాడేమోనని నాలుగుదిక్కులూ పరికించి చూశా. మూడు వైపుల తెల్లటిగోడలు, ఓ పక్క సూది దూర్చడానికి సందులేని తలుపు.

అతను చూసే అవకాశమే లేదని స్థిమితపడి మళ్ళీ రెండు చెంబుల నీళ్ళు ఒంటిమీద గుమ్మరించుకున్నాను. మళ్ళీ గుర్తుకు వచ్చాడు వసంత్.

నా నున్నటి భుజాలను, ఎద ఎత్తుల బరువువల్ల కొద్దిగా వంగిన నడుమును అతని చేతివేళ్ళతో తాకుతున్నట్లు అనిపించింది. అప్పుడు నా చూపులు వెంటిలేటర్‌వైపు మళ్ళాయి. వసంత్ రాసిన తొలి ప్రేమలేఖ ఆ వెంటిలేటర్‌లోనే దూర్చింది.

తడి ఒంటితోనే కాలి మునివేళ్ళపై నిలబడి ఉత్తరం తీశాను. నా గదిముందు పెద్ద బుట్టనిండా గులాబీలు కనిపించేయి నేను వచ్చిన తొలిదినాల్లో. దుర్గమ్మగారిని ఆ గులాబీలు బుట్ట ఎవరు పెట్టారని అడిగితే ఆమెకు తెలియదని సమాధానమిచ్చింది.

ఆ గులాబీల మధ్య వుంది మడతలు పెట్టిన తెల్ల కాగితం. తెల్లకాగితంపై ముత్యాల్లాంటి అక్షరాలు.

ఖరీదైన సెంటు వాసన ముక్కుపుటాల్లో దూరింది.

ఆ ఉత్తరం సరిగ్గా చదవకుండానే వెంటిలేటర్లో దూర్చింది అప్పుడు.

ఎటూ ఇక్కడ నుంచి వెళ్ళిపోతున్నాగదా! ఒక్క సారి చదివి అవతల పారేస్తే నష్టమేముంది?

"ప్రియమైన నీలిమా! వెలుతురు ఇవ్వడానికి పగటిపూట సూర్యుడు, రాత్రివేళల్లో చంద్రుడు, దీపం వున్నప్పటికి నువ్వు ఒక్క క్షణం కనిపించకపోతే నాకు లోకమంతా చీకటితో నిండిపోయినట్లు కనిపిస్తున్నది. మొన్న నువ్వు గదిలో లేనప్పుడు నీ గదిలో దూరి నీ బట్టలను, పరుపును, దిళ్ళను చేత్తో తడిమాను. ఎందుకో తెలుసా? నువ్వు ఉపయోగించే ప్రతి వస్తువుపై నా వేలిముద్ర వుండాలని...

పువ్వులు పూసినంత కాలం నీ వసంత్"

పిచ్చిరాతల ఆ కాగితాన్ని కసితో వుండలా నలిపి బాత్‌రూమ్‌లో ఓ మూలకు విసిరేసి స్నానం ముగించుకుని బయటపడ్డాను.

మధ్యాహ్నం రెండు గంటలకే స్కూల్లో హెడ్‌మాస్టరు రిలీవింగ్ ఆర్డర్ ఇచ్చేసేడు.

ఇంటికి వచ్చేసరికి ఇంటి ముందు జనం మూగడం కనిపించింది. సబ్ ఇన్‌స్పెక్టరు పెద్దగా అరుస్తూ దుర్గమ్మకు ఏదో చెబుతున్నాడు.

నాకు సంబంధించిన విషయం కాకపోయినా పోలీసుల్ని చూసేసరికి నా గుండెలు దడదడలాడాయి. వసంత్ ఎక్కడా కనిపించలేదు.

"మీ అబ్బాయి వసంత్ దేవాంతకుడమ్మా! మీ ఇంట్లో నగలు కాజేసి టౌనుకు తీసుకువెళ్ళి అమ్ముకున్నాడు. నువ్వేమో నగలు పోయాయంటూ మా దగ్గర మొరపెట్టుకున్నావ్. నిజంగానే మీ నగలు పోయాయేమోననుకుంటూ పాతకేడిలందరిని స్టేషన్‌కు పిలిపించి చితగ్గొట్టాం. చివరకు ఆ నగలు కొన్న వ్యాపారి మీ అబ్బాయే స్వయంగా వచ్చి నగలు అమ్మాడని చెప్పాడు" అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్.

"ఆ డబ్బుతో మా అబ్బాయి ఏం జేసుంటాడంటావ్?" దుర్గమ్మ అడిగింది.

"పోయి సోది అడగవమ్మా... ఈ సారి మీరు పిచ్చి పిచ్చి కంప్లైంటులు ఇస్తే మిమ్మల్ని స్టేషన్‌కు లాక్కెళ్ళతాను" సబ్ ఇన్‌స్పెక్టరు దుర్గమ్మను బెదిరించి వెళ్ళిపోయాడు.

నాకు ఆ ఇంట్లో ఒక్క క్షణం వుండబుద్ధి కాలేదు.

సామానంతా సర్దుకున్నాను. ఓ గోనెసంచిలో వంటపాత్రలు, రెండు సూట్‌కేసుల్లో బట్టలు, చిన్న చిన్న వస్తువులు సర్దుకున్నాను. మరో సంచిలో పుస్తకాలు. రిక్షా కోసం ఎంతసేపు ఎదురుచూసినా ఊళ్ళోకి ఒక్క రిక్షాకూడా రాలేదు. మూడు మైళ్ళ దూరంలో వున్న పొన్నూరు చేరాలంటే రిక్షానో, ఎడ్లబండో ఎక్కాల్సిందే.

సూట్‌కేసులు, గోనెసంచి రోడ్డుమీదే పెట్టుకుని రిక్షానో, ఎడ్లబండో దొరక్కపోతుందా అని ఎదురుచూస్తూ నిలబడ్డాను. ఎక్కడనుంచి ఊడిపడ్డాడో సాయంత్రం ఐదు గంటలకు ఎడ్లబండితో సహా ప్రత్యక్షమయ్యాడు వసంత్.

"బండెక్కు నీలిమా" తలొంచుకుని అన్నాడు.

అతని జుట్టు బాగా రేగిపోయి వుంది. మొహంలో విచారం స్పష్టంగా కనిపించింది. ఏదో పోగొట్టుకున్న వాడిలా బండి చక్రాలకేసి చూస్తూ వుండిపోయాడు.

సబ్ ఇన్‌స్పెక్టరు ఇంటికొచ్చి గొడవచేసిన సంగతి తెలిసిందేమో!

"మీ బండి మీద నేను ఎక్కను" అనేశాను.

తల్లి నగలు అమ్ముకున్నాడంటే అతనిమీద అసహ్యం గుండెల్లో చోటు చేసుకుంది.

"ఒక్క రిక్షాకూడా కనిపించడంలేదు... బస్సు అందుకోలేవేమో" అన్నాడతను.

అతని బండి ఎక్కక తప్పలేదు.

నా సామానంతా అతనే బండిమీద చేర్చాడు. బండిమీద ఎండుగడ్డి పరిచి దానిమీద చిరుచాప వేశాడు. కూర్చుంటే మెత్తగానే వుంది. ఎడ్లను అదిలిస్తూ కుదుపుల్లేకుండా బండిని ముందుకు పోనిచ్చాడు.

నా ఆలోచనలన్నీ అతను నగలు అమ్మిన డబ్బు ఏం చేశాడాని? పేకాటలో పోగొట్టుకున్నాడా? టౌనులో పడుచుపిల్లని వుంచుకుని తగలేశాడా? ఎవ్వరికీ తెలియకుండా తాగుతున్నాడా?

అయినా అతని సంగతి నాకెందుకు? మరో రెండు గంటలు గడిస్తే అతనెవరో తనెవరో ?

మాటిమాటికి అతను వెనక్కు తిరిగి నా వైపు చూస్తూనే వున్నాడు. చీర కుచ్చెళ్ళులోంచి కనబడే నా పాదాలమీద అతని చూపులు నిలిచిపోతున్నాయి.

అతన్ని గట్టిగా మందలించాలనిపించింది. 'పొలం పనులమీద శ్రద్ధ పెంచుకుని, తల్లి మనస్సు కష్టపెట్టకుండా బుద్ధిమంతుడవనిపించుకో' అందామని నోటిదాకా వచ్చింది. తలెత్తి చూసేసరికి మబ్బులు నీలి ఆకాశాన్ని కప్పేశాయి. మబ్బులు దట్టంగా పట్టడంతో చీకటైపోయినట్లుంది. రోడ్డుకు ఇరుపక్కల వున్న చెట్లు దర్పంగా ఊగుతున్నాయి.

వర్షపుజల్లులు మొదలయ్యాయి. భయంకరంగా ఉరిమింది ఆకాశం. భయం వేసింది నాకు.

తొట్లో కూర్చున్న అతని దగ్గరికి జరిగి అతని భుజంమీద చేతులువేశా. ఉరుములు, మెరుపులు, గాలి, వాన, ఊగిపోతున్న చెట్ల కొమ్మలు చేస్తున్న రొద వీటన్నిటిమధ్య చిక్కుకుపోయాం.

బండి రోడ్డుపక్కన ఆగిపోయింది. ఎడ్లు ముందుకు కదిలేది లేదని మొరాయించాయి.

అతను తన భుజం మీద టవలు తీసి నా భుజాల చుట్టూ కప్పాడు. అతని చేతివ్రేళ్ళు నా భుజాలను తాకుతుంటే హాయనిపించింది. మేఘాల గర్జనలకి భయపడి అతన్ని అతుక్కుపోయా.

అతను నన్ను తన ఒడిలోకి లాక్కున్నాడు. నా మీదకు నొరిగిపోయి నా మీద వర్షం

పడకుండా చెయ్యాలని తాపత్రయపడ్డాడు. అతని పెదాలు నా చెక్కిళ్ళమీద, మెడమీద వెచ్చటి ముద్రలు వేశాయి.

నా మెదడును తొలిచేస్తున్న ప్రశ్నను ఆ వాన హోరులోనే అడిగేశా.

" మీ అమ్మ నగలు ఎందుకు అమ్ముకోవాల్సి వచ్చింది? ఆ డబ్బు ఏం చేశారు?"

"నువ్వు నాకు దూరంగా వెళ్ళిపోతే బ్రతకలేనేమోననిపించింది. మూడుసార్లు నీకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వస్తే నేను హైద్రాబాద్ వెళ్ళి ఓ స్నేహితుడిని పట్టుకుని డబ్బులు ఖర్చుపెట్టి ఆ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ కాన్సిల్ చేయించా. ఆ పనికే ఉపయోగించా అమ్మనగలు అమ్మితే వచ్చిన డబ్బుని".

మెరుపు వెలుగులో మన్మధుడిలా కనిపించేడు నా కళ్ళకు. నా కోసం ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధపడే అతన్ని నేనెందుకు వదులుకోవాలి? ఎప్పుడూ నా సన్నిధిలో వుండాలని తహతహలాడే అతనికి దూరంగా నేనెందుకు వుండాలి? తేనెలాంటి తియ్యటి మనస్సు వున్నవాడిని నేనెందుకు దూరం చేసుకోవాలి?

అతన్ని గట్టిగా వాటేసుకున్నాను.

" నా చేతిగాజులు అమ్మేసైనాసరే, ఈసారి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాన్సిల్ చేయిస్తా" అన్నాను ఉద్రేకంతో.

నన్ను మాట్లాడనివ్వకుండా నా పెదాలు జుర్రుకుంటున్నాడతను.

ఆ క్షణంలో దట్టమైన చీకటి, ఉరుముల శబ్దం, జలజలరాలే వాన చినుకులు నాకు భయాన్ని కలిగించలేదు. ఆనందాన్ని కలిగించాయి. ఒకే ఇంటికప్పు కింద రెండేళ్ళు మేమిద్దరం వున్నా ఒకరినొకరు తాకలేదు. ఇప్పుడు ప్రకృతే మా ఇద్దరిని కలిపింది.

ఇన్నాళ్ళూ అతన్ని చుట్టుముట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసిన వలపుగాలి ఇప్పుడు నన్ను ముట్టడి చేస్తూ వుంది.

మెరుపు వెలుగులో మమ్మల్ని ఎవరైనా చూస్తారేమోనన్న భయం మాకు ఇప్పుడు లేదు. *

**(స్వాతి సరసమైన కథల పోటీలో బహుమతి పొందిన కథ - 1-3-1996)**